## 7.2.7 చేతనావర్త కవిత్వం

సుప్రసన్న, జగన్నాథం, సంపత్కుమార, నరసింహారెడ్డి ఆధునిక భావ ముద్ర గలిగిన చేతనావర్త కవులు, నిరంతరాన్వేషణ, స్వప్నలోకం నుండి యదార్థంవైపు, ఆదర్శంనుండి ఆత్మానుభవం వైపు సాగింది వీరి కవితా ప్రస్థానం. ప్రగతిశీలమైన సాహిత్యంలో పరిణామం తప్పదు. కాలాన్ని, దూరాన్ని జయించిన వైజ్ఞానిక యుగంలో పరిణామ వేగం హెచ్చి, తదనుగుణంగా సాహిత్య స్వరూపం మారుతూ వచ్చింది. సాహిత్య భవితవ్యాన్ని నిర్ణయించేది వాటిలోని కవితాగుణం తప్ప మరేదీ కాదంటారు చేతనావర్త కవులు. మానవుని పురోగమనమే వీరి ప్రధాన లక్ష్యమైనా భూత భవిష్యద్వర్తమాన కాలాలను సమదృష్టితో చూసారు. రాజకీయ ఆర్థిక సామాజిక దృక్పథంతోబాటు వ్యక్తికి జ్ఞానం అవసరం. మానవ చైతన్యానికి దాని వికాసానికి వీరు ప్రాధాన్యమిచ్చి రచనలు చేబట్టారు.

మనస్సు పొందాల్సిన పరిణతను వివరిస్తూ మానవుని మనస్సు ఉన్న భూమిక నుండి ఉన్నత భూమిక మీదికి ఆరోహించాలని దానికి కొన్ని భూమికలను దాటి (భౌతిక, ప్రాణిక, బౌద్ధిక, మానసిక, ఆధ్యాత్మిక భూమికలు) మానవుడు ఉన్నత మానవుడుగా ఎదగాలని సుప్రసన్న శ్రీ అరవిందుల తత్త్వాన్ని వివరించారు.[1]

"చేతనావర్త కవులు భావిని దర్శనం చేస్తున్నారు. మానవ జీవితంలోని పురోగతి, సుదూరాకాశాల స్ఫురించే దివ్య జీవన శిఖరం అధిరోహించడం వీళ్ళు భావిస్తున్నారు. కాలం వీళ్ళకు అనంతమైన అఖండమైన ప్రవాహం.

1. కోవెల సుప్రసన్నాచార్యులు, చేతనావర్తం వచన కవితా సంకలనం, మొదటి భాగం, సాహితీ బంధు బృందం, వరంగల్లు, 1967, పుట 20.



భావియుగంలో ప్రజా మంజులమైన దివ్య భావచైతన్యావరణ ప్రభాత వేళలోని స్వర్ణ కిరణాలను వీళ్ళు దర్శిస్తున్నారు."[1]

చేతనావర్త కవులకు పూర్వమున్న ఆధునిక కవులు భూత భవిష్యత్కాలాల కన్నా వర్తమానవే ముఖ్యమన్నారు. కాని ఈ కవులు వర్తమానాన్ని తిరస్కరించలేదు. అన్ని కాలాలను సమగ్ర దృష్టితో వీక్షించారు. ఆధునిక కవులు వర్తమాన జీవనమే ప్రధానమని మానవుని భావన పరిధిని సంకుచితం చేసారు. పేరార్వం జగన్నాథం భావకవులను, అభ్యుదయ కవులను ముఖ్యంగా దిగంబర కవులను 'యథాయథాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత' అనే కవితలో ఖండించారు. కాల స్వరూపాన్ని 'తమసోమా జ్యోతిర్గమయ'లో 'ఇలా జరుగుతుందని, ఇలా జరిగి తీరుతుందని నాకు తెలుసంటారు' పేర్వారం. 'కాలం హత్య చేయబడింది, కాలాన్ని బ్రతికించుకోవాలి' అని కాల స్వరూపాన్ని ఈ విధంగా మార్చిన దానవుడెవరోనని 'కాలాంతకుడు'లో వర్ణిస్తూ కాల జ్ఞానతత్త్వాన్ని ఈ విధంగా వివరించారు. కాలాన్ని అదుపులో పెట్టుకోగలవాడు కాలానికి కళ్ళెం బిగబడతాడు, కాలంతోపాటు ప్రయాణం చేసేవాడు కాలంతోపాటు ఈదుతాడు, కాలాన్ని ప్రేమించగోరేవాడు కాలం తన్నినా ఓర్చుకోవాలన్నారు.

చేతనావర్త కవులు రెండవ సంకలనంలో కాలానికి ప్రాధాన్యమిచ్చి అనేక కవితలు రూపొందించారు.

సంపత్కుమార 'వర్తమానవృత్తం'లో
"వర్తమాన జ్ఞాన శిఖరాగ్రంపై నిటారుగా నిలబడి
భూత భవిష్యత్తుల్ని సమీక్షించటానికి మారుగా
గతం నుంచి భవిష్యత్తు చూచే ఉబలాటులు
భవిష్యత్తు నుంచి గతం చూచే బులపాటులు".[2]

1. కోవెల సుప్రసన్నాచార్యులు, చేతనావర్తం వచన కవితా సంకలనం, మొదటి భాగం, సాహితీ బంధు బృందం, వరంగల్లు, 1967, పుట 20.
2. చేతనావర్తం 2, సాహితీబంధం, వరంగల్లు, 1970, పుట 4.

భూత భవిష్యత్ కాలాలలో బ్రతికే వాళ్ళనీ బ్రతకనీ వర్తమానాన్ని గుర్తించటానికి మనస్కరించని వాళ్ళను దూరంగా ఉండనీ మొత్తం మీద కాలం అనాద్యనంతం. అనుభవానికందిన భవిష్యత్తు, భూతాన్ని గూర్చిన భయం లేదు. వర్తమానానికేమో నిలకడ లేదు. ముందున్న పండుగ స్వరూపమేమిటి అని 'అంతర్వలయం' కవితలో భవిష్యత్తు కోసం ఎంత ఎగిరినా ఎగరవచ్చు. ద్రాక్ష గుత్తి అందకనే పోవచ్చు అని అనిశ్చిత స్థితిని వర్ణించారు.

"ఈ నక్క ఎంత ఎగిరినా ఎగురవచ్చు
దాని కా ద్రాక్ష గుత్తి అందకనే పోవచ్చు".[1] –అంతర్వలనం
'భవిష్యత్తందకుండా అల్లిన సాలిగూళ్ళు' –ఆవర్త ప్రవృత్తి

కాలాన్ని కత్తిరించి చూడకు, గతంలోకి తొంగి చూడవచ్చు, వర్తమాన కేంద్రం మీద నిలబడి భవిష్యత్తును అందుకోను వచ్చని 'కాలాన్ని కత్తిరించి చూడకు' అని నరసింహారెడ్డి కాల స్వభావాన్ని వివరించారు.

గతం పునాది వంటిది. వర్తమానం మీద నిలబడి చీకటి మబ్బుల వెనుక నున్న ఉషస్సనే భవిష్యత్తును తీర్చిదిద్దాలి.

"దేశాన్ని విభజించి భజించరాదు
అది అఖండ స్వరూపం
జీవితం దేశకాలాల సహగామి, వేరు చెయ్యరాదు
అది త్రివేణీ సంగమం" [2]

అని త్రికాల ప్రాధాన్యత సమగ్ర స్వరూపాన్ని అందిస్తుంది. ఏ ఒక్క కాలాన్ని విడదీసి చూడరాదు. చేతనావర్త కవులు సమగ్రకాల తత్త్వదర్శనాన్ని కవితలలో ప్రబోధించారు. భూత వర్తమాన భవిష్యత్కాలాలు చైతన్య కాలపు క్షణిక రూపాలు ఏ ఒక్క అరలో బతికినా సుఖపడలేరు.

---

1. చేతనావర్తం, 2 సంకలనం, పుట 6.
2. నరసింహారెడ్డి, చేతనావర్తం, సాహితీబంధు బృందం, హనుమకొండ, 1970, పుట 29.



'గతంలోంచి అనుభవాన్ని పిండి వర్తమాన విషవలయాల్ని భేదించి భవిష్య దాశాంచలాల వైపు చేతులు చాచి మనిషిలో నిగూఢంగా ఉన్న మానవతను జాగృతం చేయటమే'[1] పేర్వారం జగన్నాథం కవిత్వంలోని చేతనావర్తం.

'నేనీలోకం భవిష్యత్తుపై జ్యోతిష్యం చెప్పబోతున్నాను' అని పేర్వారం జగన్నాథం భవిష్యద్గీత కవితలో వర్తమానం కూడ మనల్ని నమ్మించి మోసం చేస్తుందని వర్ణించారు. భూతకాలం మనిషికి మనిషికీ మధ్య వివక్షను నేర్పిందని, దూరాన్ని పెంచిందని, వర్తమానం గ్రహదోషం పట్టిందని అంటూ వర్తమానం 'కారు చీకట్లో త్రాగుబోతువాడు నడుపుతున్న బ్రేకుల్లేని మోటారు కారులో ప్రయాణం'లా ఉందన్నారు. భూత, వర్తమాన కాలాల కన్నా భవిష్యత్తు మీదే దృష్టి ఉంది.

'సంతత చంచలమైన
వ్యక్తా వ్యక్తమైన
ఈ బిందువుపైన నిలబడ్డ నేను
'రేపు'గా మారిపోతున్నాను
నీవూ 'నేను' కాగూడదూ ?!'[2] – భవిష్యద్గీత

రెక్కలు కట్టుకు వచ్చింది రేపు అని సుప్రసన్న వ్యక్తమైన భూతకాలానికి అవ్యక్తమైన భవిష్యత్కాలానికి మధ్య నిలబడి భవిష్యత్తులోకి పయనిస్తున్నారు. భవిష్యత్తును ఆశించే వ్యక్తులుగా అందరూ ఎదగాలనేది వీరి ఆశయం. మంచికైనా చెడుకైనా మానవుడే కేంద్ర బిందువు. మానవతా పరిమళం గుబాళించి జీవన మాధుర్యం వినిపించటమే భవితవ్యానికి పునాది.

---

1. నరసింహారెడ్డి, చేతనావర్తం, సాహితీబంధు బృందం, హనుమకొండ, 1970, పుట 53.
2. సంపాదకుడు సంపత్కుమారాచార్యులు, చేతనావర్తం, రెండవ భాగం, సాహితీ బంధుబృందం, వరంగల్లు, 1992, పుట 220.